
ముస్తాఫిజుర్ (4/29)

# చెన్నై చమక్

## ఆర్‌సీబీపై ఘన విజయం

### ముస్తాఫిజుర్ విజృంభణ
### రాణించిన రచిన్, దూబే

**ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్కే) అదిరిపోయే బోణీ కొట్టింది. సొంత ఇలాఖాలో తమకు తిరుగులేదని మరోమారు చాటిచెబుతూ ప్రియమైన ప్రత్యర్థి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై ఘన విజయం సాధించింది. ముస్తాఫిజుర్ నాలుగు వికెట్ల విజృంభణతో ఓ దశలో స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందనుకున్న ఆర్‌సీబీ..రావత్, కార్తీక్ రాణించడంతో పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో శివమ్ దూబే, రచిన్ రవీంద్ర, జడేజా బ్యాటింగ్‌తో చెన్నై తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది.**

చెన్నై: ఐపీఎల్-17వ సీజన్‌ను చెన్నై తమదైన రీతిలో షురూ చేసింది. శుక్రవారం జరిగిన సౌత్ డెర్బీ పోరులో చెన్నై 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై అద్భుత విజయం సాధించింది. తొలుత ఆర్‌సీబీ నిర్ణీత ఓవర్లలో 173/6 స్కోరు చేసింది. ముస్తాఫిజుర్(4/29) ధాటికి 78 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఆర్‌సీబీ..అనూజ్ రావత్(48), కార్తీక్(38 నాటౌట్) రాణించడంతో గౌరవప్రదమైన స్కోరు అందుకుంది. పటిదార్(0), మ్యాక్స్‌వెల్(0)సున్నాలు చుట్టారు. లక్ష్యఛేదనలో చెన్నై 4 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. శివమ్ దూబే (34 నాటౌట్) రచిన్ రవీంద్ర (37), జడేజా (25 నాటౌట్), సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లోనే రచిన్ మంచి పరిణతి కనబరిచాడు. గ్రీన్ (2/27) రెండు వికెట్లు పడగొట్టాడు. ముస్తాఫిజుర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. శనివారం లీగ్‌లో డబుల్ హెడర్ జరుగనుంది.

**ముస్తాఫిజుర్ ఆన్ ఫైర్:**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూరుకు మెరుగైన శుభారంభం లభించింది. చాహర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ ఐదో బంతిని ఫోర్‌గా మలిచి కెప్టెన్ డుప్లెసిస్ పరుగుల ఖాతా తెరిచాడు. వ్యక్తిగత కారణాలతో దాదాపు రెండు నెలల పాటు ఆటకు దూరంగా ఉన్న కోహ్లీ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. మరో ఎండ్‌లో డుప్లెసిస్ దూకుడు ప్రదర్శిస్తూ చాహర్ వేసిన మూడో ఓవర్లో నాలుగు బౌండరీలతో 17 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన బంగ్లా స్వింగ్‌స్టర్ ముస్తాఫిజుర్ రెహమన్..ఆర్‌సీబీ వికెట్ల పతనానికి తెరతీశాడు. భారీ షాట్‌కు ప్రయత్నించిన డుప్లెసిస్..డీప్ పాయింట్‌లో రచిన్ రవీంద్ర క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో మొదటి వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. రెండు బంతుల తేడాతో రజత్ పాటిదార్(0) ధోనీకి క్యాచ్ ఇస్తూ రెండో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. మరుసటి ఓవర్‌లోనే హార్డ్ హిట్టర్ మ్యాక్స్‌వెల్(0)ను చాహర్ మూడో వికెట్‌గా పంపాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి మూడు వికెట్ల నష్టానికి 42 పరుగులు చేసింది. ఇదే అదనుగా కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒత్తిడి పెంచడంతో ఆర్‌సీబీకి పరుగుల రాక మందగించింది. ఈ క్రమంలో ఓవరాల్‌గా టీ20ల్లో 12000 మార్క్ అందుకున్న కోహ్లీ అంతగా ప్రభావం చూపించలేకపోయాడు. మరోమారు బౌలింగ్‌కు వచ్చిన ముస్తాఫిజుర్..ఈసారి బంతి తేడాతో కోహ్లీ(21), కామెరూన్ గ్రీన్(18) ఔట్ చేసి ఆర్‌సీబీని పీకల్లోతు కష్టాల్లో పడేశాడు. రహానే రిలే క్యాచ్‌తో కోహ్లీ ఔటైతే..గ్రీన్ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. మొత్తంగా చెన్నైకి ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే ముస్తాఫిజుర్ తనదైన మార్క్ చూపెట్టాడు.


దూబే (34*)

**ఆదుకున్న రావత్, కార్తీక్:**

78 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందనుకున్న ఆర్‌సీబీని అనూజ్ రావత్, దినేశ్ కార్తీక్ ఆదుకున్నారు. ఈ ఇద్దరు కలిసి మొదట్లో సింగిల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేస్తూ కుదురుకున్నాక బౌలర్లపై విరుచుకుపడ్డారు. తుషార్ దేశ్‌పాండే 18వ ఓవర్లో కార్తీక్ సిక్స్, రావత్ రెండు సిక్స్‌లు, ఫోర్‌తో 25 పరుగులు దక్కించుకున్నారు. ఇలా వీరిద్దరు వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి పరుగు తీయబోయిన రావత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆరో వికెట్‌కు 95 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. చెన్నైపై ఆరో వికెట్‌కు ఆర్‌సీబీకి ఇదే అత్యుత్తమం.

**చెన్నై ఛేదన:**

బెంగళూరు నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యఛేదనను చెన్నై తమదైన శైలిలో మొదలుపెట్టింది. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే రుతురాజ్ ఫోర్ కొట్టి తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. మరో ఎండ్‌లో రచిన్ రవీంద్ర కూడా బ్యాటు ఝులిపించడంతో చెన్నైకి పరుగుల రాక సులువైంది. యశ్ దయాల్ నాలుగో ఓవర్లో రెండు ఫోర్లతో దూకుడుమీద కనిపించిన గైక్వాడ్..గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో రచిన్ తనదైన జోరు కొనసాగించడంతో పవర్‌ప్లే ముగిసే సరికి చెన్నై 62/1 స్కోరు చేసింది. ఆ మరుసటి ఓవర్‌లోనే సూపర్ సిక్స్‌తో ఇన్నింగ్స్ గేర్ మార్చిన రచిన్ (37) కర్ణ్‌శర్మ బౌలింగ్‌లో రెండో వికెట్‌గా ఔటయ్యాడు. అయినా వెనుకకు తగ్గని చెన్నై..దూబే, జడేజా బ్యాటింగ్‌తో గెలుపు లాంఛనాన్ని పూర్తి చేసింది.

### కోహ్లీ @ 12,000

రన్ మిషీన్ విరాట్ కోహ్లీ టీ20లలో మరో అరుదైన ఘనత అందుకున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో 12 వేల పరుగులను పూర్తి చేసుకున్న తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు. చెన్నైతో మ్యాచ్‌లో ఆరు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ ఈ రికార్డు అందుకున్నాడు. క్రిస్ గేల్ 360 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత అందుకోగా కోహ్లీకి 368 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి.

### సంక్షిప్త స్కోర్లు

**బెంగళూరు:** 20 ఓవర్లలో 173/6(రావత్ 48, కార్తీక్ 38 నాటౌట్, రెహమాన్ 4/29, చాహర్ 1/37), **చెన్నై:** 18.4 ఓవర్లలో 176/4(దూబే 34 నాటౌట్, రచిన్ 37, గ్రీన్ 2/27, కర్ణ్‌శర్మ 1/24).

# ఆరంభం అదుర్స్..

చెన్నైలో చిందేసిన ఫ్యాన్స్





ఐపీఎల్ 17 సీజన్ ఆరంభానికి ముందు బీసీసీఐ నిర్వహించిన ప్రారంభ వేడుకలు ప్రేక్షకులను అలరించాయి. బాలీవుడ్ అగ్రతారలు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ తమ నృత్యాలతో చెపాక్ స్టేడియాన్ని ఉర్రూతలూగించారు. అక్షయ్ ఎంట్రీ ఆకట్టుకుంది. ఈ ఇద్దరూ భారత జాతీయ పతాకాన్ని చేతబూని స్టేడియం అంతా బైక్‌పై కలియతిరిగారు. అనంతరం ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్, మోహిత్ చౌహన్, ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్‌లు తమ పాటలతో అలరించారు. ఏఆర్ రెహ్మాన్.. హిందీతో పాటు తమిళ పాటలూ ఆలపించడంతో తమిళ తంబీలు మైమరిచిపోయారు. 'బల్లె లక్క', 'నీ సింగం దా' పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. వీళ్ల ప్రదర్శనతో పాటు ఆగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ సాయంతో ఢిల్లీ గేట్, చంద్రయాన్ విజయం, జీ20 నిర్వహణకు సంబంధించిన విజువల్స్ చూపరులను కట్టిపడేశాయి.

## బధిరులకూ ఐపీఎల్ మజా..




న్యూఢిల్లీ: బధిరులకూ ఐపీఎల్ మజాను అందించేందుకు గాను ఈ లీగ్ టెలివిజన్ పార్ట్‌నర్ స్టార్ స్పోర్ట్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తాజా ఎడిషన్‌ను ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (చేతి సైగల భాష) సాయంతో బధిరులు, పూర్తిగా వినికిడి కోల్పోయిన వ్యక్తులు, పాక్షిక దృష్టి లోపం కలిగిన క్రికెట్ అభిమానులకు ఈ లీగ్‌లో బాల్ బై బాల్ అప్‌డేట్స్‌ను కామెంట్రీ రూపంలో అందించనుంది. ఇండియన్ సైనింగ్ హ్యాండ్స్ (ఐఎస్‌హెచ్ న్యూస్) సాయంతో పాటు బీసీసీఐ అండతో స్టార్ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐపీఎల్‌లో సైన్ లాంగ్వేజ్ ద్వారా కామెంట్రీ అందించడం ఇదే ప్రథమం కావడం విశేషం. ఈ నిర్ణయంపై భారత బధిరుల టీమ్ కెప్టెన్ వీరేందర్ సింగ్ హర్షం వ్యక్తం చేశాడు.

## జంపా, మింజ్ స్థానాలు భర్తీ

న్యూఢిల్లీ : వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్-17కు దూరమైన రాజస్థాన్ రాయల్స్ స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానాన్ని ఫ్రాంచైజీ భర్తీ చేసింది. అతడి స్థానంలో దేశవాళీలో ముంబై తరఫున ఆడే ఆఫ్ స్పిన్నర్ తనుష్ కొటియాన్‌ను ఎంపిక చేసింది. ఇటీవలే ముగిసిన ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో భాగంగా కొటియాన్.. సెమీస్, ఫైనల్స్‌లో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌తోనూ మాయ చేసి ఆ జట్టు విజయాలలో కీలకపాత్ర పోషించాడు. రూ. 20 లక్షల కనీస ధరతోఅతడు రాజస్థాన్‌తో చేరాడు. మరోవైపు బైక్ ప్రమాదంతో తాజా ఎడిషన్‌కు దూరమైన జార్ఖండ్ గిరిజన తెగకు చెందిన కుర్రాడు, వేలంలో రూ. 3.6 కోట్లు దక్కించుకున్న రాబిన్ మింజ్ స్థానంలో గుజరాత్ టైటాన్స్.. కర్ణాటక ఆటగాడు బీఆర్ శరత్‌ను రూ. 20 లక్షల బేస్ ప్రైస్‌తో భర్తీ చేసింది.

## పతిరాన ఫిట్



చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆ జట్టు పేసర్, డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ అయిన మతీశ పతిరాన గుడ్ న్యూస్ చెప్పాడు. గాయం కారణంగా చెన్నై - బెంగళూరు మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు దూరమైన పతిరాన.. పూర్తిగా కోలుకుని ఐపీఎల్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని అతడి మేనేజర్ అమిలా కలుగలగె ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించాడు. గత సీజన్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన పతిరాన.. 19 వికెట్లు తీసి సీఎస్‌కే తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఉన్నాడు. అతడు త్వరలోనే చెన్నై టీమ్‌తో కలిసే అవకాశముంది.

## క్వార్టర్స్‌లో శ్రీకాంత్

### స్విస్ ఓపెన్ టోర్నీ

బాసెల్ : స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జిలు క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్.. 21-16, 21-15 తేడాతో టాప్ సీడ్ లి జి జియా (మలేషియా)ను ఓడించాడు. గత కొంతకాలంగా తొలి రౌండ్‌లకే పరిమితమవుతున్న శ్రీకాంత్‌కు 16 మ్యాచ్‌ల తర్వాత ఇదే తొలి క్వార్టర్స్ కావడం గమనార్హం. మరోవైపు రజావత్ 21-14, 21-13 తేడాతో చైనాకు చెందిన లి లా జి ని ఓడించాడు. లక్ష్యసేన్‌తో పాటు పీవీ సింధు పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది.



## భాగ్యనగరిలో 'తండేల్'



నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సందర్భంగా సెట్స్ నుంచి షూట్ డైరీస్ పేరుతో కొన్ని ఫొటోలను విడుదల చేశారు. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న జాలరుల నేపథ్య కథాంశమిది. అనూహ్య పరిస్థితుల్లో పాకిస్థాన్ సైన్యానికి పట్టుబడ్డ జాలరుల బృందం అక్కడి నుంచి బయటపడటానికి చేసిన ప్రయత్నాలు ఏమిటన్నదే చిత్ర కథాంశం. సర్వైవల్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో దేశభక్తి అంశాలు, నాయకానాయికల మధ్య ప్రేమకథ హృదయాన్ని స్పృశిస్తాయని చిత్ర బృందం చెబుతున్నది. షూట్ డైరీస్‌లో నాగచైతన్య, సాయిపల్లవి డీ గ్లామర్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో జరిగే ఈ కథను అక్కడి నేటివిటీ, సహజత్వం ప్రతిబింబించేలా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్ దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల, సమర్పణ: అల్లు అరవింద్, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

## పాటల పల్లకిలో దేవర

ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ప్రస్తుతం గోవాలో షూటింగ్‌ను జరుపుకుంటున్నది. ఈ పాన్ ఇండియా చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. రెండు భాగాలుగా తెరకెక్కిస్తుండగా.. తొలి భాగం అక్టోబర్ 10 విడుదల కానుంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ గోవాలో మొదలైంది. రాజు సుందరం నృత్య దర్శకత్వంలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆన్‌లొకేషన్ వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్ మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతంలో తన వారిని రక్షించుకోవడానికి ధీరోదాత్తుడైన కథానాయకుడు చేసిన పోరాటం, ఈ క్రమంలో అతనికి ఎదురైన అవరోధాలు ఏమిటన్నదే ఈ చిత్ర కథాంశం. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా, అత్యున్నత సాంకేతిక హంగులతో తెరకెక్కిస్తున్నారు. కొద్ది వారాల క్రితం విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ శక్తివంతంగా కనిపించారు. బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ ఈ సినిమాలో ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: అనిరుధ్, ప్రొడక్షన్ డిజైనర్: సాబు సిరిల్, నిర్మాణ సంస్థలు: ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, సమర్పణ: నందమూరి కల్యాణ్‌రామ్, దర్శకత్వం: కొరటాల శివ.



## ఆ ఆలోచనైతే ఉంది..

సాయిపల్లవి నిజంగా టిపికల్ సౌతిండియన్. తను అందరి లాంటి ఆడపిల్ల కాదు. ఆమెలోని ఆత్మవిశ్వాసం.. ఆత్మగౌరవం.. నిజాయితీ.. ఆమె అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. సాటి తారలతో నిలబడితే ధృవతారగా మెరిసిపోతుంటుంది తను. అందుకే ఆమెకు అంతమంది అభిమానులు. 'గార్గి' తర్వాత సినిమాలకు విరామం ఇచ్చి, దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగొచ్చిన ఈ బంగారుబొమ్మ.. ఇప్పుడిప్పుడే నిదానంగా మళ్లీ సినిమాలకు సైన్ చేస్తున్నది. తెలుగులో నాగచైతన్య 'తండేల్', తమిళంలో శివకార్తికేయన్ సినిమా ఇప్పటికే ఓకే చేసింది. అమీర్‌ఖాన్ కొడుకు హీరోగా రూపొందుతోన్న సినిమా ద్వారా బాలీవుడ్‌లో అరంగేట్రం చేయనున్నది. ఇక నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న 'రామాయణం'లో సీతగా నటిస్తున్న విషయం తెలిసిందే. మొత్తంగా మళ్లీ సాయిపల్లవి బిజీబిజీ అయిపోయింది. ఇక అసలు విషయానికొస్తే.. నటిగా ఇప్పటికే అన్ని వర్గాల ప్రేక్షకులనూ మెప్పించిన సాయిపల్లవి, త్వరలో మెగా ఫోన్ పట్టనుందట. ఈ విషయాన్ని స్వయంగా ఆమే తెలిపింది. 'నాకు డైరెక్షన్ చేయాలనే ఆలోచన ఉంది. దానికోసం నా అభిరుచికీ, ఆలోచనకూ తగ్గట్టు ఓ కథ కూడా రాసుకుంటున్నాను. ప్రస్తుతం అది ఆలోచన మాత్రమే. మరి నా కథకు నిర్మాతలెవరో నాకే తెలియదు. నాకు తెలిశాక మీకు చెబుతా' అంటూ అందంగా నవ్వేసింది సాయిపల్లవి శంతామరై.




తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డిని ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ ఆత్మీయంగా సత్కరించింది. శుక్రవారం హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫిల్మ్ క్రిటిక్స్ అధ్యక్షుడు సురేష్ కవిరాయని, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.. ఫిల్మ్ జర్నలిస్ట్‌ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

## 31కిలోల బరువు తగ్గాను



*'90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే వ్యక్తి కథ ఇది. అక్కడ ఆయన సంక్షుభిత జీవన ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ సాగుతుంది' అన్నారు మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). బ్లెస్సీ దర్శకత్వం వహించారు. ఈ నెల 28న విడుదలకానుంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ '2018లో షూటింగ్‌ను ప్రారంభించి..లాక్‌డౌన్ వంటి ఎన్నో అవాంతరాలను దాటుకొని ఈ సినిమాను పూర్తిచేశాం. కథలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయి. ఈ సినిమా కోసం తొలుత బరువు పెరిగి..ఆ తర్వాత 31కిలోలు తగ్గాను. బరువు తగ్గేందుకు ఒక షెడ్యూల్ తర్వాత ఏడు నెలల గ్యాప్ తీసుకున్నా' అన్నారు.*



## నాకు నేనే ఇష్టం.. మీకేంటంట కష్టం?

'నేనే సుబ్రమణ్యం.. మై నేమ్ ఈజ్ సుబ్రమణ్యం.. నాకు నేనే ఇష్టం.. మీకేంటంట కష్టం..' 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాలోని పాటకు చెందిన పల్లవి ఇది. ఈ పాటను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. భాస్కరభట్ల సాహిత్యానికి కల్యాణ్ నాయక్ బాణీ కట్టగా, రామ్ మిరియాల ఆలపించారు. ఇందులో రావు రమేష్ టైటిల్ రోల్‌ని పోషిస్తున్నారు. 'నేటివిటీతో కూడిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. వినోదంతోపాటు మంచి కథ కూడా ఉంటుంది. రావు రమేశ్ కెరీర్‌లో ఈ సినిమా ప్రత్యేకం' అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు. ఇంకా నిర్మాతలు కూడా మాట్లాడారు.

చిత్రం



## టిల్లు రెట్టింపు వినోదం

ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న సినిమా 'టిల్లు స్క్వేర్'. బ్లాక్‌బస్టర్ 'డీజే టిల్లు'కు ఈ సినిమా కొనసాగింపు కావడంతో యువతరం ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందుకు తగ్గట్టే ప్రచార చిత్రాలన్నీ విశేష ప్రజాదరణ చూరగొన్నాయి. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సినిమా చూసి సెన్సార్ సభ్యులు ఆద్యంతం వినోదభరితంగా తెరకెక్కించిన దర్శకుడు మల్లిక్‌రామ్‌ను అభినందించారు. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్‌ని జారీ చేసింది. 'డీజే టిల్లు'ను మించే స్థాయి విజయాన్ని 'టిల్లు స్క్వేర్' సాధిస్తుందని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేస్తున్నది. టిల్లు పాత్ర, సిద్ధు జొన్నలగడ్డ పలికే సంభాషణలు, అనుపమా పరమేశ్వరన్ అందం, అభినయం, సిద్ధు, అనుపమ కాంబినేషన్ సన్నివేశాలు థియేటర్లలో రెట్టింపు వినోదాన్ని అందిస్తాయని మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు.. ఈ చిత్రానికి కెమెరా: సాయిప్రకాశ్, సంగీతం: రామ్ మిరియాల, భీమ్స్ సిసిరోలియో, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాత: సూర్యదేవర నాగవంశీ, నిర్మాణం: సితార ఎంటర్‌టైన్మెంట్స్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.



## జీవితాలను మార్చిన సినిమా

దర్శకుడు మారుతి తొలి చిత్రం 'ఈ రోజుల్లో' (2012) యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని సాధించింది. శ్రీనివాస్, రేష్మ జంటగా నటించిన ఈ చిత్రాన్ని గుడ్ సినిమా గ్రూప్ నిర్మించింది. ఈ చిత్రాన్ని నేడు రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మారుతి మాట్లాడుతూ ' చిన్న బడ్జెట్‌తో చేసిన ఈ సినిమా మా అందరి జీవితాలను మార్చివేసింది. 12 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రాన్ని మళ్లీ బిగ్‌స్క్రీన్‌పై చూసుకోవడం ఆనందంగా ఉంది' అన్నారు. పీఆర్‌ఓగా ఉన్న తనను నిర్మాతను చేసిన చిత్రమిదని, నాడు యూత్‌లో ట్రెండ్‌సెట్ చేసిందని నిర్మాత ఎస్‌కేఎన్ తెలిపారు. 50లక్షలతో తీసిన ఈ సినిమా అప్పట్లో సంచలన విజయం సాధించిందని, కంటెంట్ ఈజ్ కింగ్ అని దర్శకుడు మారుతి ఆ రోజుల్లోనే నిరూపించాడని శ్రేయాస్ శ్రీనివాస్ అన్నారు.